# ప్రతిక్రియ

'శండిల'



"కాని ఆర్నెల్లు తిరగలేదు—అప్పుడే ఆగి పోయింది" పట్నంవెళ్లే భర్తతో గొణిగింది శాంతమ్మ. ఆయన అసలే విసుపుగల మనిషి. "ఏం జెయ్యమంటావ్? ఒక్కొక్క వస్తువు గొన్న వేళావిశేషం. నూట ఇరవై రూపాయలు దాని మొహాన వెలగబెట్టి బెట్టెండు కంపెనీది గదా, ఇల్లాలు లేడీవాచ్ గావాలని ముచ్చట పడుతూంది గదా అని కొన్నాను. నీ దశ బావుండకపోతే ఎవ రేంచేస్తారు? ఇలాగిచ్చేయ్! బాగు చేయించుకొస్తాను" ప్రత్యుత్తర మిచ్చాడు బయలుదేరడానికి చెప్పుల్లో కాళ్లుపెడుతూ సాంబశివరావు. ఆయన కడపమెట్టు దిగుతూండగా శాంతమ్మ వెనక్కి పిలిచి, "పోనీ! బాగు చేయించి కొన్నసొమ్ము కొంచెం మించు మించు వస్తుందని తోస్తే అమ్మెయ్యండి. తులం బంగారమొస్తే పుస్తెలత్రాడైనా చేయించుకుంటాను" అన్నది. ప్రయాణమై వెడుతూంటే ఎవరేనా ఎందుకేనా సరే వెనక్కిదీస్తే దాన్ని అపశకునంగా తలపోసే ఛాందసులలో అగ్రేసరుల జాబితాలోవుండే సాంబశివరావు భార్య అలా పిలిచినందుకు లోపల్లోపలే ఏవగించుకుని "అలాగే" అని ముడిగా త్రుంచేసి చరచర నడకసాగించాడు. ముందు ఏమి రానున్నదో అని సందేహం ఆతన్ని రోడ్డువైపు నెమ్మదిగానే నడిపించింది.

కాని జరిగిందింకొకలాగున. అనుకోనట్లుగా ఆతడు రోడ్డుమీదకు అడుగుబెట్టేడో లేదో అల్లంతదూరాన ఎదురయ్యింది పట్నంపోయే బస్సు. ఖాళీగా వుంది. సాయంత్రం అయిదు దాటకుండా పట్నం చేరవేసింది అయన్ను.

ఆ వేళ తాను లేచినవేళ మంచిదనుకోవడానికి సాంబశివరావు కింకొక మహదవకాశం లభించింది. బస్సుస్టాండులో దిగీ దిగడంతోనే పూర్వమిత్రు డొకడు ఎదురయ్యాడు. వాళ్ళింట్లో ఏదో శుభం జరిగిందట-పట్టుబట్టి అతన్ని తీసుకెళ్ళి ఏడుగంటలు దాటకుండా షడ్రసోపేతంగా భోజనంపెట్టి పంపించాడు బజారుకు. ఆయన వాచీల రిపేరింగు షాపువైపు వస్తున్నాడు.

మెయిన్‌రోడ్డు బహురద్దీగా వుంది జనంతో. సాయంత్రం బజారు చేసుకునే జనం ముందుకు పోయేవాళ్లకు ఎడమియ్యడం లేదు. ఆ సమయంలో ఆ త్రొక్కిడిలో అనుకోకండా, తన కాలిక్రింద నలిగిపోయిన ఒక కాగితపు మడతను ఎందుకో పైకితీసి చూడాలనిపించి, సాంబశివరావు చూడడం సంభవించింది. సాంబశివరావు మునిసిపల్ ఎలక్ట్రికుదీపపు కాంతిలో దాన్ని చూస్తూ తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. 'ఇవాళ నిజంగా తాను లేచిన వేళావిశేషం బహుదొడ్డది; నిజంగా నక్కనడుం త్రొక్కివచ్చాను' అని పదే పదే అనుకున్నాడు. అది పదిరూపాయల నోటు-మాసినది-జనుల కాళ్ల త్రొక్కిడినబడి నలిగినది. అనూహ్యంగా అతన్ని ఆవహించిన లక్ష్మి పలువిధాల భావాలతో అతన్ని ముంచెత్తింది. "ఇదెవరిదో-పాపం! పారేసుకున్నారేమో! ఇదొక్కటే తమసర్వసంపదై-లేదా-దీన్ని తమ ఏఅక్కర లేక ఆపదను తొలగించుకోవడానికై ఏ పేదవారో అట్టేబెట్టుకున్నదో-అప్పే దెచ్చుకున్నదో కాదుగదా! కావచ్చు—అయితే తానెవరికని దాన్ని ఎక్కడికి తీసుకెళ్ళియిస్తాడు? కాకున్నా పదిరూపాయల కాగితానికి ఆనమాలేమిటీ? తాను వెర్రిగా అడగబోతే ఎవరైనా మాదే అనెయ్యొచ్చు-ఆ సందర్భంలో అట్టి ప్రతి ఇతర వ్యక్తికంటే తానే ఆ అయాచితద్రవ్యానికి యోగ్యుడై వుంటాడే! కాగా తానలాగ ఒరుల నడగడం

వారు తన్ను లేకిగా తీసిపారేస్తారే" ఇదీ ఒక తరంగం.

"సిరి తనకు తా కాళ్ళకు సాగిలపడి వచ్చినపుడు నాకీ ఆలోచనలేల? ఇది నాకై యే అర్పిత మయ్యింది. కాకున్నా పేదవాడిదే అని ఎందుకనుకోవాలి? తెగబలిసిన మోతుబరి సొమ్ములోనిది, లేదా నిర్దాక్షిణ్యంగా లంచంగుంజిన అవినీతిపరుడైన అధికారిది— ఎందుకు కాకూడదు? ఇది కేవలం నా రేఖ వల్ల లభించింది." పాపం! సాంబశివరావు మనందరిలాగునే రెండో వూహ వల్లనే కైవసం చేసుకోబడ్డాడు. ఐతే తాను రాత్రి నడిచినంతమేరకు ఎవరైనాఎదురై "బాబూ! ఒక పది రూపాయల కాగితం దొరికిందా రోడ్డుమీద మీకుగానీ?" అని అడిగితే, తనను అమితానందంలో ముంచెత్తుతున్న, దైవికంగా తటస్థపడిన, పెన్నిధిరూపంలో గోచరించిన, పెద్ద బెడదను విరగడ చేసుకుందాం, అనే ఊహాపేచిక ఆతనిలో పొడ చూపకపోలేదు. కాని మంచిదే అయినా అట్టి మోచనకు యీ యుగంలో ఎక్కడో గాని వత్తాసు దొరకదు. పరిస్థితులు అట్టిది లభించినా దాన్ని త్రోసిరాజనమని మనస్సును వత్తిడిపెట్టి తప్పుదారి కీడ్చేస్తాయి. సాంబశివరావు కొంచెమైనా చింతించ నక్కరలేకపోయింది, అట్టి యాచనావాక్యం ఆ రాత్రి ఏ మూలనుంచి ఎదురుపడక పోవడంతో.

వాచీ రిపేరరుముందు నిలబడేసరికి ఎనిమిదయ్యింది. అతడు రోజుపని అంతా ముగించుకొని కొట్టు కట్టేస్తున్నాడు. అట్టివాడు సాంబశివరావుమాట తీసెయ్యలేకపోయాడు. తొమ్మిదిగంటలదాకా కూర్చొని వాచీ పూర్తిగా బాగుచేసేశాడు. కిరాయి యివ్వబోతే "ఎంతమాట! వద్దులెండి. ఇది మా షాపులో కొన్నదేగా! కాకున్నా ఏడాదిదాకేవరకు మేం మరమ్మతు ఉరికేచేసి ఇవ్వడం మా నియమం. ఇవేళ మీ వద్ద అయిదు రూపాయలు తీసుకుంటే మా కలకాలం వుండవలసిన పరపతి మాట!" అన్నాడు. ఆహా! ఏమిటీ వైచిత్రి! ఒక్కొక్కరోజు ఒక్కొక్క వ్యక్తి జీవితంలో ఎంత కమనీయంగా గడుస్తుందీ! అని విస్తుపోయాడు సాంబశివరావు.

"ఇవాళంతా లాభమే". స్నేహితునింటి వద్ద రాత్రి పన్నెండు గంటలకు పాన్పుపై పవ్వళిస్తూ, ఎలెక్ట్రిక్ పంకా గాలిక్రింద హాయి ననుభవిస్తూ గుణించుకుంటున్నాడు సాంబశివరావు: "లేదంటే పదిహేను రూపాయలు అనుకోకుండా కలిసివచ్చింది. "కలిసొచ్చే కాలానికి, నడిచొచ్చే బిడ్డ పుడతాడం"టారిందుకే. వాచీ రిపేరరు గారు నే ననుకున్నట్లు ఆఖరికి కొన్న ఖరీదు కేనా—పోనీ-ఆర్నెల్లు వాడుకున్నందుకో పది రూపాయలు మినహాయించుకునైనా నూటపదికి అడిగితే బావుండును. "అరె— మీరు అమ్మతారని తెలియదుసుమండీ. మధ్యాహ్నమే ఒక వకీలుగారు వెస్టెండ్ లేడీ రిస్టువాచ్ గావాలన్నారు. సరే. రేపు ఇచ్చేస్తానులెండి," అని రిపేరరు అన్నపుడు జనించిన కొండంత ఆశా "నూరు రూపాయలనడం"తో కొంత మందగించింది. నేను తెగించి నూటపదిహేను కిచ్చెయ్యండి అన్నా. పోనీ ఆయనైనా ఇంకో పదిఅంటాడేమో అనుకున్నా. అనలేదు. మనకింతే ప్రాప్తి వున్నప్పుడు ఎలాగంటాడు? "ఎక్కడి కక్కడే వెనకటిలక్ష్మి" అనుకోవాలి. సాంబశివరావుకు సుఖంగా నిద్ర పట్టింది.

మరునాడు ప్రొద్దున్నే బస్సుస్టాండుకు వచ్చాడు. అయితే అతనికి రెండుబస్సులూ ఖాళీలేవు. మూడవబస్సులో ఇంటికొచ్చేసరికి పదిన్నరయ్యింది. జరిగిన కథంతా చెబుతూ నవ్వుకుంటూ, కేరింతాలతో పెనిమిటి తనజాతకాన్ని పొగడుకుంటూంటే శాంతమ్మ ఆనందానికి అంతులేదు. "దైవికంగా ఒక్కొక్కప్పుడు కష్టాలెలా కట్టగట్టుకు వస్తూంటాయో సుఖాలు, సంపదలూ అలాగే వస్తూంటాయి" అని శ్రుతికలుపుతూ "పోనీ! ఆ అమ్మకపోవడమూ మనమంచికే జరిగిందనుకోరాదూ! చూడండి- నేనంటున్నా. వారంరోజు లాగి మళ్ళీ పట్టుకెళ్ళండి వాచీ- రక్కున నూటఇరవై వస్తాయి. అసలు లేడీ వాచీలు ఈమధ్య రావడంలేదుట. ఇంకా లాభమే రావచ్చు మీరు కొంచెం బెట్టుసరి చేస్తే. దానితో నాను పేటా మజూరీలుపోను ఇంకా లేదంటే పాతికరూపాయలు మిగుల్తాయి" గడుసుదనానికి పిడిపెట్టుకుంది శాంతమ్మ.

భోజనం పూర్తిచేసుకుని తాంబూలం సేవించి పందిరి పట్టెమంచంపై మేనువాల్చే సాంబశివరావును "ఏదివాచీ—చూద్దాం" అని అడిగింది భార్య. "ఆచేతి సంచీలో వుంది కేస్‌లో" అని నిర్లక్ష్యంగానే జవాబిచ్చాడు సాంబశివరావు. వాచీకై వెళ్ళిన శాంతమ్మ అరగంట సేపటి దాకా తిరిగి రాలేదు—కారణం ఏమిటో కనుక్కుందాం అని లేవబోతుంటే శాంతమ్మ అతని కెదురైన స్థితి, అప్పట్లో ఆమె ముఖంతీరూ "ఏమండీ సంచీలో వాచీకేస్ లేదే"అని బొంగురుపోయినరుద్ధకంఠంతో అనే ఆమె పలుకు పోలిక సాంబశివరావును నిశ్చేష్టుణ్ణిచేశాయి. పదిరూపాయల కాగితం దొరికిన నిమేషంలో దాని కథనం విన్నముహూర్తంలో ఆ దంపతులలో మెదిలిన భావాలకువలె—మరి ఆవాచీపోవడంగూడా దైవికంగానే సంభవించింది గనుక—ఇప్పుడసలు ఏ వూహాలు కదలడంలేదు. ఎంతసేపో చెప్పలేనుగాని వాళ్ళ మెదళ్లు మొద్దుబారి స్థాణువులుగా నిలిచిపోయాయి—రెండు సంఘటనలూ దైవికాలేగదా—మరి మానవునిపై ఆరెంటి ప్రభావమూ ఒకేరీతిగా ఏలవుండదు-ఇదేనా ఆ పరాత్పరుని లీలలోని (అందరికీ తెలిసివున్నా ఎవ్వరూ గ్రహించలేని) చిదంబర రహస్యం ? ? ★




అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్రసేఫ్ కంపెని,

| షో రూము: | వర్కుషాపు: |
|---|---|
| సరస్వతీటాకీస్ రోడ్, | మునిసిపల్ ఆఫీసురోడ్, |
| విజయవాడ-1. | విజయవాడ-1. |

బ్రాంచి: ప్రకాశంరోడ్ - విజయవాడ-2.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణములలో సేల్సుఏజంట్లు కావలెను. వివరములకు వ్రాయండి.